# కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )

హైదరాబాద్
శనివారం
23-03-2024

వెల రూ.4/-
సంపుటి: 272 సంచిక: 15
పేజీలు: 04

Editor: Vanam Nagaiah



## కేజ్రీవాల్ అరెస్టు మోదీ ఓటమికి నాంది!




వివరాలు 02లో..

# ఢిల్లీ మద్యం స్కాంలో ప్రధాన సూత్రధారి కేజ్రీవాలే

**సుమారు రూ.600కోట్ల వరకు చేతులు మారాయి..**



**న్యూఢిల్లీ, కెరటం న్యూస్-మార్చి22:**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కింగ్‌పిన్ కేజ్రీవాల్ అని ఇడి అధికారులు తెలిపారు. ఇది కేవలం వందకోట్ల వ్యవహారం కాదని, లంచాల్లో భాగస్వామ్యం కూడా తోడు కావడంతో ఈ మొత్తం కనీసం 600కోట్లు ఉంటుందని ఇడి కోర్టుకు తెలియచేసింది. గురువారం రాత్రి అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు ప్రవేశపెట్టారు. ఈ కేసులో ప్రశ్నించేందుకు కేజ్రీవాల్‌ను 10 రోజులపాటు కస్టడీకి అప్పగించాలని జడ్జిని ఈడీ కోరింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి 9:05 గంటలకు అరెస్టు చేశామని, 24 గంటల్లోపు అతడిని జడ్జి ముందు హాజరుపరిచినట్టు ఈడీ పేర్కొంది. రిమాండ్ కోరుతూ మిగతా 2లో..



# టార్గెట్ 14

**14 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రణాళిక**
**త్వరలో పార్లమెంట్, అసెంబ్లీ, బూత్ స్థాయిలో కమిటీలు..**
**స్థానిక నేతలతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, కెరటం న్యూస్-మార్చి 22:**

లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. దీనికోసం మూడంచెల్లో సమన్వయం చేసుకునే విధంగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనుంది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల వారీగా, పోలింగ్ బూత్‌స్థాయిలో ఈ కమిటీలను నియమించి, సమన్వయంతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం అందుబాటులో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్య నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయా లని, బాధ్యతలు పంచుకోవడంతో పాటు కార్యకర్త లకు వెన్నంటి నిలవాలని సూచించారు. గత ఎన్ని కల్లో విజయతీరాన్ని చేర్చిన మల్కాజిగిరి మోడల్‌ను రాష్ట్రమంతటా అనుసరించాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో మూడు స్థాయిల్లో నియమించనున్న మిగతా 2లో..

# మరో ఇద్దరికి బీఆర్ఎస్ గ్రీన్‌సిగ్నల్

- నాగర్‌కర్నూల్ నుంచి ప్రవీణ్‌కుమార్..
- మెదక్ నుంచి వెంకట్రామిరెడ్డి
- ఇప్పటివరకు మొత్తం 13 మంది ఖరారు



**హైదరాబాద్, కెరటం న్యూస్-మార్చి 22:**

లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే మరో ఇద్దరు అభ్యర్థుల పేర్లను బీఆర్ఎస్ ప్రకటించింది. మెదక్ నుంచి ఎమ్మెల్సీ పరిపాటి వెంకట్రా మిరెడ్డికి, నాగర్‌కర్నూల్ నుంచి ఇటీవలే బీఎస్పీ నుంచి చేరిన ఆర్ఎ స్ ప్రవీణ్‌కుమార్‌కు పార్టీ అధినేత కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మొత్తంగా బీఆర్ఎస్ 13మంది అభ్యర్థులను ఖరారు చేసినట్ట యింది. మరో 4సీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా 2లో..




## ఆరుగురు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, ఒక సీపీఐ ఎమ్మెల్యేకు జారీ
- వారి ఎన్నికను సవాల్ చేస్తూ.. మూడు బెంచ్‌ల వద్ద ఏడు పిటిషన్ల విచారణ
- కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం.. వచ్చే నెలలో వేర్వేరుగా విచారణ

**హైదరాబాద్, కెరటం న్యూస్-మార్చి 22:**

శాసనసభ్యులుగా ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పలు పిటిషన్లకు సంబంధించి కాంగ్రెస్ నుంచి గెలిచిన ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన మిగతా 2లో..

## ఎమ్మెల్సీ కవితకు దక్కని ఊరట

- బెయిల్ కోసం ట్రయల్‌కోర్టుకు వెళ్లాలన్న సుప్రీంకోర్టు
- బెయిల్ పిటిషన్ త్వరితంగా విచారించాలని సూచన
- రాజకీయనేత ప్రమేయం కాబట్టి చట్టబద్ధ పరిష్కారాలు దాటవేయలేమన్న ధర్మాసనం
- నేటితో ముగియనున్న కస్టడీ

**న్యూఢిల్లీ, కెరటం న్యూస్-మార్చి22:**

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తన అరెస్టు అక్రమమంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లాలని సూచించింది. కేసులో రాజకీయ నేత ప్రమేయం ఉన్న కారణంగా చట్టబద్ధమైన పరిష్కారాలు దాటవేయలేమని వ్యాఖ్యానించింది. మిగతా 2లో..



**మత్తుకు అలవాటు చేసి..**

## రేవ్ పార్టీలకు!

2

## భూటాన్ చేరుకున్న మోడీ

**రెండ్రోజులు పర్యటనలో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ**

**న్యూఢిల్లీ, కెరటం న్యూస్-మార్చి22:**

రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం భూటాన్ వెళ్లారు. గురువారమే పీఎం మోదీ భూటాన్ వెళ్లాల్సి ఉండగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పర్యటన వాయిదా పడింది. పారో మిగతా 2లో..




## ఎలక్షన్ ఎఫెక్ట్.. పరీక్షల తేదీల్లో మార్పు

- మే 7, 8వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా..
- మే 9,10,11వ తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు
- జూన్ 5, 6వ తేదీల్లో ఐసెట్ పరీక్ష

**హైదరాబాద్, కెరటం న్యూస్-మార్చి22:**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో జరగాల్సిన పలు ఎంట్రన్స్ టెస్టుల తేదీల్లో మార్పులు జరిగాయి. తెలంగాణ ఎంసెట్ పరీక్షను షెడ్యూ ల్ కంటే ముందుగానే నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయిం చింది. అలాగే ఐసెట్ పరీక్షను ఒక్క రోజు పోస్ట్ పోన్ చేసింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఎప్ సెట్ పరీక్షలు మే 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జర గాల్సి ఉంది. కానీ తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు మే 13న జరగనున్నాయి. పరీక్షలకు, ఎన్నికల మిగతా 2లో..



## కేజ్రీవాల్ అరెస్టు మోదీ ఓటమికి నాంది!

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:**




ఆమ్‌ఆద్మీపార్టీ జాతీయ అద్యక్షుడు, డిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టు మోదీ ఓటమికి నాంది గా వివిధ పక్షాల రాజకీయ నేతలు ధ్వజం ఎత్తారు.శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లోఆప్ జిల్లా అద్యక్షులు స్వర్ణ సుబ్బారావు అద్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఇండియా కూటమి, వివిధ రాజకీయ పక్షాల నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టు ను నిరశించారు.ప్రజల తరపున పనిచేసే ముఖ్యమంత్రంలను అరెస్టు చేయించి,భయోత్పాతంతో పార్లమెంటు ఎన్నికల్లో నెగ్గాలనే పాసిస్టు ఆలోచన తో మోదీ ఉన్నారని నేతలు విమర్శించారు.ఆమ్‌ఆద్మీపార్టీ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆఫ్ తెలంగాణా కోర్కమిటీ సభ్యులు నల్లమోతు తిరుమల రావు తొలుత మాట్లాడుతూ 2015నుండిబిజెపి ఎన్నికల పరాబవం నుభరించలేక కేజ్రీవాల్ పట్ల మోదీ కక్షపూరితంగా వ్యావహరిస్తున్నారని సోదాహరణంగా వివరించారు.డిల్లీ లిక్కర్ కుంభకోణం మోదీ అబద్దాల ప్యాక్టరీ లో ఉత్పత్తి అయిన కట్టుకథేనని వివరించారు.కేజ్రీవాల్ అరెస్టు మోదీ ఫాసిస్టు రూపానికి పరాకాష్టగా పేర్కొన్నారు.సుప్రింకోర్టు ఆదేశాల మేరకు ఎలెక్టోరల్ బాండ్ల ద్వారా మోదీ అవినీతి బురద బయటపడడంతో దిక్కుతోచని మోదీ దాన్ని మభ్య పెట్టేందుకు ప్రతిపక్ష నేతలపై దాడులు, అరెస్టు లు చేస్తున్నాడని ఆయన విమర్శించారు.సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిజేపి అవినీతి ని కప్పి పెట్టుకోవడానికే, ప్రతిపక్షాల పై ఇడి, సిబిఐ,ఐటీ పేరుతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు.రాజ్యాంగ సంస్థలను తమ జేబు సంస్థ లు గా బిజెపి మలచుకొని ప్రతిపక్షాలు పై దాడులు చేస్తుందని దుయ్యబట్టారు.అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు మోదీ పిరికి రూపానికి నిదర్శనంగా పేర్కొన్నారు.పిసిసి సభ్యులు,నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ మతచాందసవాది మోదీ అదికారం లోనికి మళ్ళీ వస్తే ప్రజాస్వామ్యం అనే మాటకే ఇక అర్థం ఉండదని అన్నారు.బిజేపి ఎలెక్టోరల్ బాండ్లు బయట పెట్టడం లో యస్బిఐ పై ఎవరు వత్తిడి తెస్తున్నారని అన్నారు.కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్లు సీజ్ చేయడం లాంటి చర్యలు చూస్తుంటే బిజెపి మోదీని ఓటమిభయం వెంటాడు తుందని ఆయన విమర్శించారు.మోదీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇండియా కూటమి గెలుపు ను ఆపలేరని అన్నారు.సిపిఐయంయల్ (ప్రజా పంథా) జిల్లా కార్యదర్శి గొకినపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్ళు అదికారంలో ఉన్న బీజేపీ దేశాన్ని సర్వనాశనం చేసింది,ప్రజలనుమోస పూరితంగా, మాయమాటలు తో మభ్య పెడుతూఅదానీలకు దోచి పెడుతూ మళ్ళీ అదికారంలోనికి రావాలని ప్రయత్నాచేస్తుందని అన్నారు.అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఖండించారు.పాసిస్టు బిజేపిని ఓడించాలని ఇటీవల జరిగిన తమ జాతీయ మహాసభలు తీర్మానం చేసిన విషయం ఆయన గుర్తు చేశారు.సిపిఐ రాష్ట్ర నాయకులు జితేంద్ర రెడ్డి మాట్లాడుతూ అవినీతి లో కూరుకు పోయిన బిజెపి పార్టీ రాజ్యాంగ సంస్థలు ఇడి, సిబిఐ,ఐటీ సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష పార్టీలు పై కేసులు పెట్టి వేధి స్తుంది, ప్రస్తుతం కేజ్రీవాల్ అరెస్టు ద్వారా బిజేపి పతనం అంచులు చేరు కుందని దుయ్యబట్టారు.తెలంగాణాజనసమితి నగర అధ్యక్షుడు జలగేపల్లి రవి మాట్లాడుతూపేద ప్రజల విద్యా, వైద్యం కోసం పనిచేసిన కేజ్రీవాల్ అరెస్టు అక్రమం అన్నారు.బిజేపి,మోదీ లో పెరుగుతున్న అసహానం ఓటమి కి చిహ్నంగా భావించాల న్నారు.సిపిఐ యంయల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యస్కే ఖాశీం మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలు అణచివేసిన మోదీ నియంత స్వరూపం కేజ్రీవాల్ అరెస్టు తో పరాకాష్టకు చేరిందని ధ్వజం ఎత్తారు.సభలో ఆఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్,సహాయ కార్యదర్శి సిద్దెల రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నేత తాటి వెంకటేశ్వర్లు, పిఓడబ్ల్యు నేత ఝాన్సీ, సిపిఎం నాయకులు విక్రం, కాంగ్రెస్ నాయకులు గోపాల్,యంయల్ నేతలు సివై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.వివిధ రాజకీయ పక్షాల కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి కేజ్రీవాల్ అరెస్టు కు నిరసన తెలిపారు.

## టార్గెట్ 14..

(మొదటి పేజీ తరువాయి..)

కమిటీలను ఒకట్రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఏఐసీసీ పరిశీల కులతో పాటు ఆ నియోజకవర్గంలోని ముఖ్యనేత లు సభ్యులుగా ఉంటారు. ఆ సెగ్మెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఎమ్మెల్యే, లేదంటే నియోజకవర్గ ఇన్‌చార్జ్, మండలాల వారీగా ముఖ్యనేతలు ఉంటారు. ఇక, పోలింగ్‌బూత్ స్థాయిలో నియమించే కమిటీల్లో ప్రతి బూత్ నుంచి ఐదుగురు చురుకైన కార్యకర్తలకు అవకాశం కల్పిస్తారు. ఈ కమిటీ సభ్యులకే ఓట్లు వేయించే బాధ్యత కూడా అప్పగిస్తారు. ప్రతి బూత్‌లో వచ్చే ఓట్లను బూత్ కమిటీ సభ్యుల పనితీరుకు ప్రాతిపదికగా తీసుకొని త్వర లో నియమించే ఇందిరమ్మ కమిటీల్లో వారికి ప్రాధాన్యం ఇస్తారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక పర్య వేక్షణ బాధ్యతలను ఈ ఇందిరమ్మ కమిటీలకే అప్ప గిస్తారు. ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్‌స్థాయిలో నియమించే ఐదుగురు సభ్యుల పనితీరు కీలకం కానుంది.

**సన్నాహక సమావేశాలు..:** లోక్‌సభ ఎన్నికలకు సన్నాహక సమావేశాలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ సమావేశాలు వచ్చే వారంలో ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో ఆయా పార్ల మెంట్ నియోజక వర్గాలకు ఇన్‌చార్జ్‌లుగా ఉన్న మంత్రులతోపాటు అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొంటారు. ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ స్థాయిలో అనుసరించాల్సిన ఎన్నికల వ్యూ హం నిర్ణయిస్తారు.

## మరో ఇద్దరికి బీఆర్ఎస్ గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, కెరటం న్యూస్-మార్చి22:**

తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా గులాబీ జెండా పాతా ల్సిందేనని భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు వ్యూహ రచన చేస్తున్నారు. ఓ వైపు సిట్టింగ్ ఎంపీలు.. మరోవైపు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కారు దిగి హస్తం, కాషాయ గూటికి వెళ్లిపోతున్న పరిస్థితిలో ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. మరోవైపు అభ్యర్థుల దొరక్క బీఆర్ఎస్ నానా తిప్పలు పడాల్సి వచ్చింది. దీంతో ఎమ్మెల్యేలుగా ఓడిన, మాజీ మంత్రులను.. ఇతర పార్టీల నుంచి వచ్చిన.. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు ఆశించి భంగపడిన నేతలకు టికెట్లు ఇచ్చే పనిలో బీఆర్ఎస్ నిమగ్నమైంది. ఇప్పటికే పలువురు ఎంపీ అభ్యర్థు లను ప్రకటించిన బీఆర్ఎస్.. తాజాగా మరో రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. నాగర్ కర్నూల్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మెదక్ నుంచి మాజీ ఐఏఎస్ అధికారి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామి రెడ్డికి టిక్కెట్లు ఖరారు చేశారు. ఈ ఇద్దరిలో ఒకరు ఐపీఎస్‌గా.. మరొకరు ఐఏఎస్‌గా పనిచేసిన వారు. ఇద్దరూ వారి వారి వృత్తుల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నవారే. ప్రవీణ్ కుమార్ వీఆర్ఎస్ తీసుకుని రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. బీఎస్పీలో చేరిన ఆయన్ను తెలంగాణ అధ్యక్ష పదవి కూడా వరించింది. అయితే.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు విషయంలో నెలకొన్న విబేధాలతో బీఎస్పీకి రాజీనామా చేసి.. కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మొదట్నుంచీ నాగర్ కర్నూలు నుంచి పోటీచేయాలని భావించారు.. అనుకున్నట్లుగానే ఆయనకే టికెట్ దక్కింది. మెదక్ సీటు విషయానికొస్తే.. మొదట ఒంటేరు ప్రతాప్ రెడ్డిని ఫైనల్ చేసినట్లు వార్తలు వచ్చాయి.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన సూత్రధారి కేజ్రీవాల్

(మొదటి పేజీ తరువాయి..)

దరఖాస్తు ఇచ్చామని, అన్ని నిబంధనలను పాటించి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశామని ఈడీ అధికారులు కోర్టుకు వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టుపై బంధువులకు కూడా సమాచారం అందించామని, అరెస్టుకు సంబంధించిన ఆధారాలను 28 పేజీల్లో రాతపూర్వకంగా అందజేశామని వివరించారు. అరెస్టు పంచనామా కూడా తమ వద్ద ఉందని ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలకమైన వ్యక్తి అని, కొందరు వ్యక్తులకు మేలు చేసేందుకు డబ్బులు అడిగారని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ వెల్లడించింది. అక్రమ మార్గంలో వచ్చిన ఈ డబ్బుని గోవా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపయోగిం చిందని పేర్కొంది. మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్‌కు ప్రత్యక్ష పాత్ర ఉందని, స్కామ్‌లో ప్రధాన వ్యక్తి ఆయనేనని తెలిపింది. ఇక ఈ కేసులోనే అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ లభించలేదని న్యాయస్థానం దృష్టికి ఈడీ పేర్కొంది. ఈ కేసులో సహ నిందితురాలుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాంగ్మూలాన్ని కూడా తీసుకున్నామని ప్రస్తావించింది. ఆప్ మాజీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వద్ద పనిచేస్తున్నారని, కేజ్రీవాల్‌తో చాలా సన్నిహితంగా ఉండే విజయ్ నాయర్ మధ్యవర్తిగా వ్యవహరించాడని ఈడీ పేర్కొంది. సౌత్ గ్రూప్ నుంచి కేజ్రీవాల్ డబ్బు డిమాండ్ చేశారని, ఈ విషయాన్ని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రెండు పర్యాయాలు నగదు బదిలీ జరిగిందని వివరించారు. సౌత్ గ్రూప్‌కు లిక్కర్ పాలసీలో లబ్ది చేకూర్చేందుకు ముడుపులు తీసుకున్నారని వివరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పనలో భాగంగా ఎమ్మెల్సీ కవితను కేజ్రీవాల్ కలిశారని, కలిసి పని చేద్దామంటూ కవితతో సీఎం కేజ్రీవాల్ చెప్పారని ఈడీ పేర్కొంది. విజయ్ నాయర్ అరవింద్ కేజ్రీవాల్ కోసం పనిచేశారని, గోవా ఎన్నికల సమయంలో రూ.45 కోట్లు చేతులు మారాయని కోర్టుకు ఈడీ వెల్లడించింది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలలో ఫోన్ రికార్డ్స్ కూడా ఉన్నాయని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ తెలిపింది. విజయ్ నాయర్‌కు సంబంధించిన కంపెనీ నుంచి ఆధారాలు సేకరించామని, రూ.45 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు తేలిందని, పెద్ద మొత్తంలో నిధులు వివిధ వ్యక్తుల ద్వారా చేతులు మారాయని వివరించింది. మద్యం కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కీలక సూత్రధారి అని ఈడీ ఆరోపించింది. 'సౌత్ గ్రూప్' సంస్థకు, నిందితులకు మధ్య ఆయన మధ్యవర్తిగా వ్యవహరించారని పేర్కొంది. మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ కింగ్‌పిన్. దిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలుకు 'సౌత్ గ్రూప్' సంస్థ నుంచి రూ.కోట్ల ముడుపులు అందుకున్నారు. పంజాబ్ ఎన్నికల కోసం ఆ సంస్థకు చెందిన కొందరు నిందితుల నుంచి రూ.100 కోట్లు డిమాండ్ చేశారు. రూ.45 కోట్ల ముడుపులను గోవా ఎన్నికల్లో ఉపయోగించారు. అవి నాలుగు హవాలా మార్గాల నుంచి వచ్చాయని ఈడీ తరపు న్యాయవాదులు వాదించారు. అయితే ఇడి వాదనలను కేజ్రీవాల్ అడ్వకేట్ మను సింఘ్వి తీవ్రంగా ఖండించారు. ఆధారాలు లేని కేసులో అరెస్ట్ చేశారని అన్నారు. ఆధారాలు ఉంటే కస్టడీ ఎందుకని ప్రశ్నించారు.

# భూటాన్ చేరుకున్న మోడీ..







(మొదటి పేజీ తరువాయి..)

విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే స్వాగతం పలికారు. భారత్-భూటాన్ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో తాను ఈ పర్యటనకు వెళ్తున్నట్లు మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. భూటాన్ రాజు మెజెస్టి, ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గేతో చర్చల కోసం ఎదురు చూస్తున్నట్లు ట్వీట్‌లో పేర్కొన్నారు. భారత్‌లో త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఎలక్షన్లకు ముందు భూటాన్ పర్యటనను ప్రధాని మోదీ తన చివరి విదేశీ పర్యటనగా భావిస్తున్నారు. ద్వైపాక్షిక అంశాలపై ముఖ్యంగా చర్చించే అవకా శం ఉన్నట్లు తెలుస్తోంది. ఇరు దేశాల ప్రజల ప్రయోజనం కోసం అనుకూలమైన భాగస్వామ్యాన్ని అందించడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యం అని విదేశీ మంత్రిత్వ శాఖ తెలిపింది.

### మత్తుకు అలవాటు చేసి..

# రేవ్ పార్టీలకు!

- నిరుపేద విద్యార్థినులే లక్ష్యంగా జగిత్యాలలో దందా..
- గంజాయికి బానిసైన ఓ బాలిక వింత ప్రవర్తన
- తనలాగే 10మంది బాలికలు మత్తుకు అలవాటు పడ్డారని బాధితురాలి వెల్లడి
- రంగంలోకి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో

**జగిత్యాల, కెరటం న్యూస్-మార్చి 22:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద బాలికలను, వసతి గృహాల్లోని విద్యార్థినులకు గంజాయి అలవాటు చేసి, వారిని రేవ్ పార్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న దందా జగిత్యాల జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. జగిత్యాల పట్టణంలో ఓ బాలిక గంజాయి మత్తుకు బానిసై వింతగా ప్రవర్తిస్తుండడంతో ముఠా నిర్వాకం బయటపడింది. బాధిత బాలిక తరహాలోనే మరో 10 మంది విద్యార్థినులను ఈ ముఠా మత్తుకు బానిస చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని రెండు నెలల క్రితం వింతగా ప్రవర్తిస్తూ అస్వస్థతకు గురైంది. సెల్‌ఫోన్ వినియోగానికి బానిస కావడంతోనే బాలిక అలా ప్రవర్తిస్తుందేమోనని భావించిన తల్లిదండ్రులు ఆమెను ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించారు. బాలిక ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తమ బాలిక పట్ల జరగరానిదేదో జరిగి ఉంటుందన్న అనుమానంతో ఒక పార్టీ శాఖ జిల్లా అధ్యక్షుడితో కలిసి గత నెల 15న చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు చేశారు. అప్పటి జగిత్యాల సీఐ, బాధిత బాలికకు ప్రకృతి ఎన్జీవో ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆఫీసర్లు బాధితురాలి నుంచి వివరాలు ఆరా తీశారు. ఆమె వెల్లడించిన సమాచారం ఆధారంగా మరో 10 మంది బాలికలు కూడా గంజాయికి అలవాటు పడినట్లు గుర్తించారు. వీరికి తొలుత గంజాయి, ఆ తర్వాత డ్రగ్స్‌కు అలవాటు చేసినట్లు సమాచారం.

మత్తుకు అలవాటు పడిన బాలికలను ఓ ముఠా హైదరాబాద్‌లోని రేవ్ పార్టీలకు తీసుకెళ్లిందని, ఇందుకు ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారని తెలుసుకొని షాక్ అయ్యారు. పాఠశాలలో ప్రత్యేక తరగతులు ఉన్నాయని చెప్పి బాలికలు జగిత్యాల నుంచి హైదరాబాద్‌లోని రేవ్ పార్టీలకు వెళ్లినట్లు గుర్తించారు. బాలికలు ఓ రోజు రాత్రి పూట చెప్పాపెట్టకుండా ఇంట్లోంచి వెళ్లిపోయి రెండ్రోజుల తర్వాత తిరిగిరావడం.. పిల్లల ప్రవర్తనల్లో మార్పు రావడాన్ని తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రుల్లో కొందరు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సైతం లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. బాలికలను మత్తులోకి దించడానికి ఎలాంటి డ్రగ్స్ వినియోగిస్తున్నారు? అవి ఎక్కడి నుంచి సప్లయ్ అవుతున్నాయి? ఇప్పటివరకు ఎంత మంది ఈ ఉచ్చులో చిక్కుకున్నారు? బాలికలను రేవ్ పార్టీలకు తరలిస్తోంది ఎవరు? సదరు పాఠశాల ఉపాధ్యాయులు ఎందుకు గమనించలేదు? గతంలో పోలీస్ స్టేషన్‌లో ఎవరైనా ఫిర్యాదు చేశారా? అయితే ఎంత వరకు విచారణ కొనసాగింది.? శిశు సంరక్షణ అధికారుల విచారణలో తేలిన అంశాలు ఏమిటి? తదితర వివరాలను పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై జగిత్యాల జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రందించగా ఘటనపై లోతుగా విచారణ చేపడుతున్నామని తెలిపారు. జిల్లా బాలికల సంక్షరణ అధికారి హరీశ్ మాట్లాడుతూ సదరు బాలికకు మానసిక సమస్య ఉందన్న అనుమానంతో స్వధార్ హోమ్‌కు తరలించామని స్పష్టం చేశారు. అక్కడే తల్లిదండ్రుల సమక్షంలో పలు దఫాలుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఈ దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### ఆరుగురు ఎమ్మెల్యేలకు

# హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, కెరటం న్యూస్-మార్చి 22:**

ముగ్గురు, ఒక సీపీఐ ఎమ్మెల్యేకు హైకోర్టు శుక్రవారం వేర్వేరుగా నోటీసులు జారీ చేసింది. వారంతా వచ్చే నెలలోగా స్పందించి కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణను వచ్చేనెల (ఏప్రిల్ 16, 18, 19 తేదీలకు) వాయిదా వేసింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ (బీఆర్ఎస్), జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్), ఆసిఫాబాద్ నుంచి కోవ లక్ష్మి (బీఆర్ఎస్), మహబూబ్‌నగర్ నుంచి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రెస్), దేవరకద్ర నుంచి జి.మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్), కొత్తగూడెం నుంచి కూనంనేని సాంబశివరావు(సీపీఐ) విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఓడిన ప్రత్యర్థులు కొందరు వీరి ఎన్నికను సవాల్ చేస్తూ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వారు ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చారని, సరైన సమాచారం ఇవ్వలేదని వాటిలో పేర్కొన్నారు. ఆ ఎమ్మెల్యేల ఎన్నికను కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సూరేపల్లి నందా తదితరులతో కూడిన వేర్వేరు ధర్మాసనాలు శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రతివాదులకు నోటీసులు జారీచేశాయి.

### ఎలక్షన్ ఎఫెక్ట్..

# పరీక్షల తేదీల్లో మార్పు

(మొదటి పేజీ తరువాయి..)

తేదీకి ఒక్క రోజు మాత్రమే గ్యాప్ ఉండటంతో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని భావించిన తెలంగాణ ఉన్నత విద్యామండలి ఎప్ సెట్ తేదీల్లో మార్పులు చేసింది. మే 7, 8వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. మే 9,10,11వ తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు నిర్వహించనున్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 4, 5వ తేదీల్లో ఐసెట్ పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ జూన్ 4వ తేదీన పార్లమెంటు ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో ఒక రోజు ఆలస్యంగా ఐసెట్ పరీక్ష నిర్వహించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. దీని ప్రకారం.. జూన్ 5, 6వ తేదీల్లో ఐసెట్ పరీక్ష జరగనుంది.

# ఎమ్మెల్సీ కవితకు దక్కని ఊరట

(మొదటి పేజీ తరువాయి..)

పిటిషన్‌లో లేవనెత్తిన రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు మాత్రమే విచారిస్తామని స్పష్టం చేసింది. కవిత పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం. త్రివేదిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు ప్రారంభిస్తూ.. హైకోర్టుకు వెళ్లాలని సూచించొద్దని, అనుకూలమైనా, ప్రతికూలమైనా సుప్రీంకోర్టు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఏం జరుగుతోందో గమనించాలని, కవితకు వ్యతిరేకంగా ఒక్క ఆధారం కూడా లేదని, ఒక అప్రూవర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ కారణంగా అరెస్టు చేశారని, ఇలా చేయడం కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకమని చెప్పారు. అయితే, బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. దీంతో, హేమంత్ సోరెన్ కేసులో ట్రయల్ కోర్టులో ఏమైందో చూశామని, ఇది జరిగే పని కాదని సిబల్ పేర్కొన్నారు. రాజకీయ వ్యక్తి ప్రమేయం ఉన్నందున చట్టబద్ధమైన పరిష్కారాలు దాటవేయలేమని ్యబెంచ్ అభిప్రాయపడిందని జస్టిస్ సంజీవ్‌ఖన్నా తెలిపారు. ఒకసారి సాక్షిగా, మరోసారి నిందితురాలిగా కవితకు సమన్లు జారీ చేశారని సిబల్ చెప్పగా, అయినప్పటికీ ఆర్టికల్ 32 ప్రకారం బెయిల్ ఇవ్వలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగ ఉల్లంఘనకు సంబంధించిన అంశాలు లేవనెత్తిన కారణంగా ఇప్పటికే విచారణలో ఉన్న విజయ్ మదన్‌లాల్ కేసుకు జత చేస్తామని పేర్కొంది. దీనిపై ఈడీకి నోటీసులు జారీ చేస్తూ ఆరు వారాల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది.

# విదేశాల్లోని తెలంగాణ బిడ్డలకు అండ..

# ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్



## ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ఎన్ అర్ ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువు, ఉద్యోగం, వ్యాపారాల నిమిత్తం విదేశాలకు వెళ్తున్న ప్రతి తెలంగాణ బిడ్డలకి ఎన్ ఆరత ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఉందనే ధైర్యం ఉందన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలో జరిగిన ఎన్ ఆర్ ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా జనరల్ బాడీ సమావేశంలో అసోసియేషన్ జనరల్ బాడీ సభ్యుల ఆహ్వానం మేరకు వాసిరెడ్డి ఫంక్షన్ హాల్ నందు జిల్లా కమిటీ అధ్యక్షురాలు స్వరూప రాణి అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆర్గనైజేషన్ సభ్యులను ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ అభినందించారు. అసోసియేషన్ ఏర్పడిన ఈ రెండు సంవత్సరాల కాలంలో అసోసియేషన్ సభ్యులు చేసిన కార్యక్రమాలను సభ్యులు వారికి వివరించారు. అసోసియేషన్ అవశ్యకత మరియు విదేశాలలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత పరిస్థితులను ఎమ్మెల్సీ ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ గారు వివరిస్తూ ప్రసంగించారు. రాబోయే కాలంలో అసోసియేషన్ ద్వారా పూర్తిస్థాయి కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని వారు సూచించారు. అదేవిధంగా ఇతర దేశాల్లో ఉన్న పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షురాలు బత్తిని నీరజ, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, దుగ్గి లక్ష్మీ, రాయల రవికుమార్, నెల్లూరు వీరబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# గుడవర్తి, పాపినేని ఆశయ సాధనకు ఉద్యమించాలి

## సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి పిలుపు

**కెరటం న్యూస్-నేలకొండపల్లి 22**

సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవులు గుడవర్తి రామయ్య, పాపినేని నారాయణ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పార్టీ మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి మండలంలోని అనాసాగరం గ్రామంలో గుడపర్తి రామయ్య, పాపినేని నారాయణ 50వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత అమరవీరుల స్థూపాల వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కమిటీ సభ్యుడు ఎడ్ల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గుడవర్తి రామయ్య, పాపినేని నారాయణలు పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పనిచేస్తూ అనాసాగరం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పార్టీని అగ్ర భాగాన నిలిపేందుకు



అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేని ఆనాటి కాంగ్రెస్ గుండాలు రాజకీయంగా ఎదుర్కోలేక పిరికిపందల్లా మాటు వేసి 1974 మార్చి 21న అత్యంత దారుణంగా హత్య చేశారన్నారు. రామయ్య నారాయణలను భౌతికంగా పార్టీకి దూరం చేశారే గాని వారు నమ్మిన సిద్ధాంతాన్ని, ఆశయాలను చంపలేకపోయారన్నారు. వారి మరణపు గడియల నుండి నేటి వరకు వారి వారసత్వాన్ని పునికి పుచ్చుకొని గ్రామంలో ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించేందుకు గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు మరింత పట్టుదలగా పనిచేయడం అభినందనీయమన్నారు. గుడవర్తి రామయ్య కుమారుడు గుడవర్తి నాగేశ్వరరావు తండ్రి మరణంతో చిన్న వయసులోనే ఎర్రజెండా చేతబట్టి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తన ఆశయాలను నిలబెట్టేందుకు పార్టీని అగ్రభాగాన నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తగా, గ్రామ శాఖ కార్యదర్శిగా, మండల కమిటీ సభ్యునిగా, మండల కార్యదర్శిగా, నేడు జిల్లా కమిటీ సభ్యునిగా అనేక బాధ్యతలు చేపట్టి ఎర్రజెండాకే వన్నెతెచ్చేలా తండ్రి వారసత్వాన్ని నిలబెట్టేలా భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఎర్రజెండాను అంతం చేయాలని కుట్రలు చేసిన ఎందరో ఏమి చేయలేక కాలగర్భంలో కలిసిపోయారన్నారు. నేడు కమ్యూనిస్టులకు ఓట్లు సీట్లు సంఖ్యా బలం తగ్గిన ఎర్రజెండా కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం పేదల వెన్నంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సమాజంలో పేదల కష్టాలు ఉన్నంతవరకు కమ్యూనిస్టులు ఉంటారన్నారు. నేడు రాష్ట్రంలో, దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా సారధ్యంలో ఉద్యమించడమే గుడవర్తి రామయ్య, పాపినేని నారాయణలకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో అనాసాగరం సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మలపల్లి వెంకట నరసయ్య, శాఖ కార్యదర్శులు నున్న మధుసూదన్ రావు, బొడ్డు మధు, గ్రామ సీనియర్ నాయకులు బొడ్డు బాబురావు, (మైకు బాబు), వెంకటేశ్వర్లు అమరవీరుల కుమారులు గుడవర్తి నాగేశ్వరరావు, పాపినేని వెంకటేశ్వర్లు పార్టీ గ్రామ శాఖ సభ్యులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

# వేలం పాటల ద్వారా పర్ణశాల గ్రామ పంచాయతీకి

# రూ.83 లక్షల భారీగా పెరిగిన ఆదాయం

- **బోట్ షికారు పాటను రూ 42404000 లకు,**
- **వాహన పార్కింగ్ అశీలు పాటను రూ 40 లక్షలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్న పాట దారులు**
- **గత ఏడాది కంటే 36 లక్షల రూపాయలు పెరిగిన ఆదాయం**

**కెరటం న్యూస్ మార్చి 22 దుమ్ముగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ము గూడెం దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం కలిగిన పర్ణశాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పర్ణశాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గోదావరి బోట్ షికారు , వాహన పార్కింగ్ రుసుము వసూలు ,మరుగు దొడ్ల నిర్వహణ కు గాను జి 2024 - 2025 సంత్సం కాలానికి లైసెన్స్ హక్కులు కల్పించ డానికి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ముత్యాలారావు అధ్యక్షతన శుక్రవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు ఈ పాటలు దక్కించుకోవడానికి పాట దారులు తీవ్రంగా పోటీ పడ్డారు పోటా పోటీగా జరిగిన బహిరంగ వేలం పాటలద్వారా 83 లక్షల 45వేల రూపాయల భారీ ఆదాయం పర్ణశాల గ్రామ పంచాయతీకి చేకూరింది వాహన పార్కింగ్ ఆశీలు వసూలు పాటలో ఏడుగురు సభ్యులు డిజిట్లు చెల్లించి పాల్గొనగా





నువ్వా నేనా అని సాగిన ఈ పాటలో సీతానగరం గ్రామానికి చెందిన పోడియం వెంకటరమణ 40 లక్షల రూపాయలు హెచ్చు పాట పాడి పాటను కైవసం చేసు కున్నారు బోట్ షికారు పాటలో అయిదుగురు సభ్యులు పాల్గొనగా గోవిందా పురం గ్రామానికి చెందిన సవలం భద్రయ్య 42 లక్షల 40 వెల రుపాయలకు హెచ్చు పాట పాడి పాటను దక్కించు కున్నారు మరుగుదొడ్ల నిర్వహణా పాటను ముసలి మడుగు గ్రామానికి చెందిన వాగే రాజేశ్వరి ఒక లక్షా అయిదు వేల రూపాయలకు పాటను దక్కించుకున్నారు పర్ణశాల గ్రామపంచాయతీ గత ఎడాది వేలం పాటల ద్వారా వచ్చిన ఆదాయం 47 లక్షల 35 వేల రూపాయలు కాగా ఈ ఏడాది 83 లక్షల 45 వేల రూపాయలు రెట్టింపు ఆదాయం వచ్చింది వేలం పాటల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామపంచాయతీ పరిధి గ్రామాలలో ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ముత్యాలరావు



కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు ఈ వేలం పాటలలో దుమ్ముగూడెం ఎస్ ఐ కేశవరావు పర్ణశాల ఎం పి టి సి తెల్లం భీమరాజు పీసా కార్యదర్శి వాగే రాజేశ్వరి పిసా కో ఆడి నేటర్ రామలక్ష్మి పలువురు గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు



# వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

**రఘునాథ పాలెం, కెరటం న్యూస్**

ఖమ్మం రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామం ఎంపీటీసీ తేజావత్ శంకర్ రాణి గార్ల ఆహ్వానం మేరకు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులైన పృధ్వి రాజ్, లిహిని లను ఆస్వాదించారు. మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల పార్టీ బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీతంపేటలో ఏడు లీటర్ల గుడుంబా పట్టివేత

**కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి**

శుక్రవారం గార్ల మండలంలో గార్ల ఎస్ఐ జీనత్ కుమార్ ఆధ్వర్యంలో గార్ల మండలం సీతంపేట గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు సీతంపేట గ్రామానికి చెందిన ధరావత్ పద్మ తన ఇంట్లో ఏడు లీటర్ల గుడుంబా కలిగి ఉండటంతో పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేయడం జరిగిందని గార్ల ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపారు..



# ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్ చేసిన గార్ల ఎస్ఐ జీనత్ కుమార్

**కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి**

శుక్రవారం గార్ల మండల కేంద్రంలో గార్ల ఎస్ఐ ఎన్. జీనత్ కుమార్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా గార్ల గ్రామానికి చెందిన సయ్యద్ సలీం. మరియు గోపాలపురం గ్రామానికి చెందిన సవిటి వీరయ్య తమ యొక్క ట్రాక్టర్ లలో ప్రభుత్వం వారి నుండి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా రెండు ట్రాక్టర్ లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తీసుకొచ్చి కేసు నమోదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గార్ల ఎస్ఐ జీనత్ కుమార్ మాట్లాడుతూ మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు...







# తపస్సు కాలం పాపపరిహార పాదయాత్ర

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

తపస్సు కాలం పాపపరిహార పాదయాత్ర ను బల్లేపల్లి ఆరోగ్యమాత దేవాలయము నుండి కరుణగిరి పుణ్యక్షేత్రం వరకు కొనసాగింది . సుమారు 1000 మంది దాకా ఈ ర్యాలీలో పాల్గొన్నారు . క్రీస్తు ప్రభువు సిలువలో చనిపోయిన విధానాన్ని గుర్తు చేసుకుంటూ విశ్వాసులందరూ కలిసికట్టుగా ముందుకు సాగారు . ఈ కార్యక్రమంలో బల్లేపల్లి విచారణ మరియు రఘునాథపాలెం విచారణ ఫాదర్స్ అంతోని , సహాయ గురువు విజయకుమార్ , రఘునాథపాలెం విచారణ ఫాదర్ కొమరవెల్లి జోసెఫ్ మరియు సంఘ పెద్దలు దీక్ష బ్రదర్ లు, సిస్టర్స్, బల్లెపల్లి పెద్దలు సుదర్శన్ రావు, జనార్ధన్, రఘునాథపాలెం పెద్దలు చిరంజీవి, కె.వి.ఆర్, టీం లీడర్ పసలపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# గార్ల మండలంలో సర్వ సభ్య సమావేశం:

# డుమ్మా కొట్టిన అధికారులు




**కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి**

శుక్రవారం గార్ల మండల నూతన ఎంపీపీ భట్టు నాగరాజు అధ్యక్షతన స్థానికమండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశ సమాచారాన్ని ముందుగానే తెలియజేసినప్పటికి కొంతమంది అధికారులు గైర్హాజర్ తో సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.గైర్హాజర్ పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నీటి పారుదల పద్దు పై ముల్కనూర్ ఎంపీటీసీ మాలోత్ వెంకట్ లాల్ కలుగజేసుకొని ముల్కనూర్ ఆయకట్టు కాల్వ పనుల మరమ్మత్తుల మెయింటనెన్స్ కోసం సేకరించిన ఓ అండ్ ఎం నిధులు 2 లక్షల 90 వేలు బినామీ గుత్తేదారులు కైంకర్యం చేసిన గోల్మాల్ నిధులపై ప్రశ్నించి వివరణ కోరారు. గతంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో నాటి ఎం డి ఓ కల్పించుకొని నీటిపారుదల అధికారిని పిలిపించి వెంటనే విచారించాలని ఆదేశించిన విషయం విధితమే, అయినా అధికారుల నుంచి సమాధానం రాకపోవడం శోచనీయం. అంగన్వాడి కేంద్రాలను ప్రైవేటు వ్యక్తుల కార్యక్రమాలకు తావు ఇవ్వకూడదని ఆయన సూచించారు. పాఖాల యేటి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ ఉత్తర్వులు కాగితాలకే పరిమితమైనాయా..! శిలాఫలకాలు వేశారు.. కానీ బ్రిడ్జి పనులు మరిచిపోయారని వైస్ ఎంపీపీ కట్టె బోయిన శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.పాకాల యేటి పై బ్రిడ్జి మంజూరైన నిధులు ఇప్పటివరకు కూడా టెండర్లని పిలవకుండా కాలయాపన చేస్తున్నారని. ఈ నిధులు మంజూరైనయా కాలేదా అధికారులు దీనిపైన స్పందించాలని అధికారులను సర్వసభ్య సమావేశంలో నిలదీశారు,రాంపురం పరివాహక ప్రాంత ప్రధాన సమస్యలు పరిష్కరించాలని తక్షణమే బ్రిడ్జి కి సంబంధించిన పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ పద్దు పై అధికారి ప్రసంగిస్తుండగా, "0"విద్యుత్ బిల్లు పై పలువురు ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు? జనవరి 1 నుంచి మార్చి 22 వరకు వైద్య సేవల వివరాలను డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ వివరించారు. మండల వ్యాప్తంగా 20 గ్రామపంచాయతీలలో వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు, గార్ల ఎంపిటిసి 1 శీలంశెట్టి రమేష్ ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించాలని ఖాళీ బిందెలు సందడి చేయకుండా, తాగునీటికి అంతరాయం లేకుండా దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టాలని పలువురు ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. గార్ల పెద్ద చెరువు ప్రస్తుత నీరు అడుగంటిందని, ప్రస్తుత ఎండాకాలంలో పశువులు తాగినందుకు నీటి కొరత ఏర్పడుతుందని, చెరువు నీరు అక్రమ తరలింపును సంబంధిత అధికారులు అరికట్టాలని ఎంపీటీసీ నాగమణి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మంగమ్మ, ఎంపీటీసీ లు శీలంశెట్టి రమేష్, అలోత్ పరంగణి, గుండెబోయిన నాగమణి, దనియకుల రాజకుమారి, డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్, సత్యనారాయణ, విద్యుత్ ఏ ఈ మహేందర్ బాబు, సుధాకర్ వంశీకృష్ణ వసుంధర సజన్ స్వరూప్ ఎల్లమ్మ,పంచాయతీ కార్యదర్శులు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జీవితాంతం నిర్బంధాన్ని ఎదుర్కొన్న

# కమ్యూనిస్ట్ ఎకె గోపాలన్

**సీపీఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య,**
**జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య**

**కొత్తగూడెం, కెరటం న్యూస్ ప్రతినిధి**

జీవితాంతం నిర్బంధాన్ని ఎదుర్కొన్న గొప్ప కమ్యూనిస్టు యోధుడు ఏకే గోపాలన్ అని సిపిఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. స్థానిక మంచి కంటి భవన్లో సిపిఎం వ్యవస్థాపకుల్లో ఒకరు మొట్టమొదటి పోలిట్ బ్యూరో సభ్యులు ఏకే గోపాలాన్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఏకేజీ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీలో చేరి సోషలిస్టు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడిగా జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించారనీ అన్నారు. కేరళ రాష్ట్రం నుండి ఎంపీగా గెలిచి చట్టాలు చేయడంలో వాటిని ప్రజలకు అందుబాటులో తీసుకురావడంలో ప్రజారంజక పాలన అందించడంలో ఏ కేజీ ముఖ్య పాత్ర పోషించారని వారు కొనియాడారు. ఐదుసార్లు ఎంపీగా గెలిచి పార్లమెంటులో ప్రజా సమస్యలపై తన గళమెత్తిన వ్యక్తి అని ఉత్తమ పార్లమెంటేరియన్ గా కీర్తి గడించారని అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనూ ఏ కేజీ పైన అనేక నిర్బంధాలు విధించారని ఏళ్ల తరబడి జైల్లోనే గడిపాడని వారు అన్నారు. తన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేయడమే గాక భవిష్యత్తు తరానికి ఆదర్శంగా నిలబడిన వ్యక్తి ఏ కేజీ అని వారు అన్నారు. అంటరానితనం అసమానతలకు వ్యతిరేకంగా ఏ కేజీ పోరాడని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం మతోన్మాదం పడగలిప్పుతున్న ఈ రోజుల్లో మతసామరస్యానికై పోరాటం చేయడమే ఏ కేజీకి ఇచ్చే నివాళి అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, ఎం జ్యోతి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, దొడ్డ రవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కే సమ్మయ్య నాయకులు డి వీరన్న ఎస్ లక్ష్మి సత్య వాణి నాగకృష్ణ రాం చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**సిడిపిఓ శారద శాంతి,**
**ఎంపిడీఓ వెంకటేశ్వరరావు**

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**

ప్రతి ఒక్కరూ పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మధిర ఐసిడిఎస్ సిడిపిఓ శారద శాంతి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు లు అన్నారు. పోషణ మాసంలో భాగంగా శుక్రవారం మధిర మండల పరిధిలోని సిరిపురం రైతు వేదికలో అంగన్వాడి సూపర్వైజర్ జక్కుల నాగ సత్యవతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ పక్వాడా కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడిపిఓ శారదా శాంతి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్య రక్షణ కోసం, చిన్నారుల ఎదుగుదల కోసం, పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని మహిళలకు, గర్భిణీలకు, చిన్నారుల తల్లులకు, చిన్నారులకు సూచించారు. స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు స్వయంగా తయారు చేసిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించి తయారు చేసుకునే విధానాలను గర్భిణీలకు, బాలింతలకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వలన రక్తహీనత సమస్యలు దరి చేరవన్నారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతుడిగా జన్మిస్తాడన్నారు. గర్భిణీగా గుర్తించిన వెంటనే అంగన్వాడీ కేంద్రంలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్రంలో ప్రతినెల చిన్నారుల బరువులు, ఎత్తులు పర్యవేక్షించి అంగన్వాడీ కార్యకర్తలు తల్లులకు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఆరోగ్య లక్ష్మి ద్వారా అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజు కేంద్రాలకు వచ్చి తీసుకోవాలన్నారు. మూడు సంవత్సరాల నిండిన పిల్లలందరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలింతలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించి పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాల , అన్నప్రాసనా, అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ కృష్ణ శ్రీ, హెల్త్ సూపర్వైజర్ భాస్కరరావు, సూపర్వైజర్ లు శశి, షర్మిలాదేవి, మాలతి, బీజాన్ బీ, జ్యోతి, సుజాత, అన్నపూర్ణమ్మ, సరిత, టి సరిత, సుజాత, పోషణ్ అభియాన్ సిబ్బంది, ఆఫీసు స్టాప్, మధిర మండల స్థాయి అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, హెల్త్ సూపర్వైజర్ భాస్కరరావు, ఏ ఎన్ ఎమ్స్ సుజాత,ఝాన్సీ, ఆశ వర్కర్స్, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.





# లోపాల పుట్ట నూతన విద్యా విధానం

### నూతన విద్యా విధానంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం?
### డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**

డివైఎఫ్ఐ,ఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో మధిర మండలం సిరిపురం గ్రామ పాఠశాలలో సదస్సు నిర్వహించారు. భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్ 93 వర్ధంతి వారోత్సవాల సందర్భంగా కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధానం 2020 ను తీరుని నిరసిస్తూ సదస్సు నిర్వహించడం జరిగింది. నేటితరం విద్యార్థులకు ఉపయోగపడాల్సిన కొత్త విధానాలను అమలు చేయాల్సింది పోయి నూతన విద్యా విధానం పేరుతో అనాగరిక చర్యలను తెరపైకి తెస్తున్న కేంద్ర విద్యా విధానాన్ని ఖండిస్తున్నామని మద్దాల ప్రభాకర్ ఉద్ఘాటించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కనపర్తి వీరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న విద్యా విధానాలు విద్యార్థులకు భవిష్యత్తును నిర్దేశించే విధంగా ఉండాలి తప్ప వాళ్ళ కాళ్ళకు సంకెళ్లుగా మారకూడదని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు కొనసాగుతున్న విధానానికి స్వస్తి పలికి అంతకంటే అనాగరిక విధానాన్ని విద్యార్థులకు బోధించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న నేటి రోజుల్లో విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని నూతన విద్యా విధానాన్ని అమలు పరచాల్సి ఉండగా తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విధానం పూర్తిగా లోప భూయిష్టంగా ఉందని ఆరోపించారు. నూతన విద్యా విధానం అంటూ కొత్త పేరుతో విద్యార్థులను మోసం చేసే ఈ చర్యలకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం కంటే పాత విధానమే ఎంతో మేలైనదిగా ఉందని స్పష్టం చేశారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని విరమించుకొని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలకు విద్యార్థులందరూ శ్రీకారం చుట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుందని హెచ్చరించారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని కలలు కంటున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఆశలను విద్యార్థి లోకం అడ్డుకుంటుందని హితవు పలికారు. బిజెపి కుట్ర పూరితంగా నూతన విద్యా విధానం తీసుకొచ్చిందని, దీని ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం మారే అవకాశం వుందని, నూతన విద్యా విధానంకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో డివైఎఫ్ఐ నాయకులు అభిషేక్, కళ్యాణ్ , కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుధాలను అప్పగించండి: సిపి

**కెరటం న్యూస్ హైదరాబాద్,మార్చి22)**

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో వాటిని స్వాధీనం చేయాలని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు ముగిసే వరకు కొత్త ఆయుధ లైసెన్స్‌ల జారీని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఆయుధాలను స్వాధీనం చేసుకుంటారు. తిరిగి వాటిని ఎన్నికలు ముగిసాక అప్పగిగస్తారు. ఈ సమయంలో కొత్త లైసెన్సులు జారీ చేయరు.

## ఎడ్వేదాకు 59 మంది
# యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక

**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్**

ప్రముఖ బహుళజాతి కంపెనీ ఎడ్వేదాకు స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలకు చెందిన 59 మంది విద్యార్థులు ఎంపిక అయినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. వివిధ దశలలో నిర్వహించిన ఈ నియామక ప్రక్రియలో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచారని వారు తెలిపారు. ఐ.సి.టి. అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్లో మొత్తంగా 276 మంది విద్యార్థులు పాల్గొనగా, 123 మంది విద్యార్థులు గ్రూప్ డిస్కషన్లో లో అర్హత సాధించారని, తదుపరి యౌకిక పరీక్షలో 59 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే 297 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఇది తమకు ఎంతో గర్వకారణమని వారు అభిప్రాయపడ్డారు. ప్రముఖ ఈ లెర్నింగ్ కంపెనీ ఎడ్వేదా భారతీయ సాంకేతిక మండలి ఏఐసిటిఇ తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందని, ఐ.సి.టి. అకాడమీ వారి సహకారంతో తమ కళాశాలలో ఉద్యోగ నియామకాలు నిర్వహించడం తమకు సదవకాశమని కళాశాల ప్రిన్సిపల్ డా జి. రాజ్కుమార్ తెలిపారు. బిజినెస్ డెవలప్మెంట్ ఇంటర్న్ ఎంపికైన విద్యార్థులకు వార్షిక ఆదాయంగా 4.5 లక్షల నుండి 7.5 లక్షల వరకు అందుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్.ఆర్. బి. రాజేశ్వరీ, సి.యం.ఒ. రామ్కుమార్, టీమ్ లీడ్ అక్షయా, అన్వర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా కె. అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, డా జె. రవీంద్రబాబు, డా యన్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యన్, సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## విజయ ఇంజనీరింగ్ కళాశాలలో
# ఓటరు అవగాహన సదస్సు





**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్**

స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల నందు 18 సంవత్సరాలు నిండిన విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక ఎమ్మార్వో అఫ్జల్ హుస్సేన్ మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ గారు ఓటర్ అవేర్నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటు రిజిస్టర్ చేసుకొని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఫారం-6 ద్వారా మరియు, ఆన్లైన్లో ఫారం-6 ఫిలప్ చేసి తమ ఓటు ని రిజిస్టర్ చేసుకోవచ్చు అని చెప్పారు. ఓటు అనేది రాజ్యాంగము మనకు ఇచ్చిన హక్కు దానిని అందరూ సద్వినియోగ పరచుకుని తమ తమ బాధ్యతలను నిర్వర్తించాలి అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమాలు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. చిన్నయ్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు .

## కవిత బాధితురాలు, నిందితురాలు కాదు
# న్యాయవ్యవస్థపై సంపూర్ణ విశ్వాసముంది


### కడిగిన ముత్యం మాదిరిగా బయటకు వస్తారు: ఎంపీ రవిచంద్ర



**ఢిల్లీ బ్యూరో, కెరటం న్యూస్**

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు ఢిల్లీలో శుక్రవారం ఎంపీలు నామ,కే.ఆర్.మన్నెలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తప్పుడు కేసు బనాయించి అక్రమంగా అరెస్టు చేసిందని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేసును టీవీ సీరియల్స్ మాదిరిగా రెండేళ్లు సాగదీసి ఎన్నికల వేళ ఇప్పుడు తెరపైకి తెచ్చారని ఈడీ వైఖరిని ఆయన నిశితంగా ఎండగట్టారు. ఎంపీ రవిచంద్ర శుక్రవారం ఢిల్లీలో లోకసభలో బీఆర్ఎస్ పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభలో తన సహచర సభ్యులు కే.ఆర్.సురేష్ రెడ్డి,మహబూబ్ నగర్ లోకసభ సభ్యులు మన్నె శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, ఈడీ 2004 నుండి 2014 వరకు కేవలం 200 కేసులు మాత్రమే నమోదు చేస్తే, 2014 నుండి ఈ 10 సంవత్సరాలలో 2954 పైగా కేసులు పెట్టిందని వివరించారు. ఈ కేసుతో అసలు కవితకు ఎటువంటి సంబంధం లేదని,ఆమె బాధితురాలు మాత్రమే కానీ నిందితురాలు కాదని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ధర్మం తప్పకుండా గెలుస్తుందని,కడిగిన ముత్యం మాదిరిగా కవిత ఈ కేసును బయటకు వస్తారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

## ఖమ్మంపై ఎటూ
# తేల్చుకోలేకపోతున్న పార్టీలు



- **కాంగ్రెస్, బిజెపిల్లో ఎటూ తేలని అభ్యర్థుల వ్యవహారం**
- **నామా బిజెపిలోకి జంప్ అవుతారని ప్రచారం**

**కెరటం న్యూస్-ఖమ్మం,మార్చి22)**

ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి విషయంలో కాంగ్రెస్, బిజెపిలు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే బిఆర్ఎస్ ఆ పార్టీ నేత నామా నాగేశ్వర రావును మరోమారు తమ అభ్యర్థిగా ప్రకటించింది. అయితే అభ్యర్థుల ఎంపికలో బిజెపి, కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఇక్కడి నుంచి పోటీపడిన ప్రధాన పోటీదారు రేణుకాచౌదరి రాజ్యసబకు ఎంపిక కావడంతో సమస్య కొంత తీరింది. అయినా అక్కడ కాంగ్రెస్‌కు గట్టి అభ్యర్థులు కానరావడం లేదు. బిజెపి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎవరు వస్తారా అని బిజెపి ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో బీజేపీలో ఖమ్మం ఎంపీ టికెట్ హీట్ పెంచుతోంది. టికెట్ హామీతోనే బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన జలగం వెంకట్రావు కాషాయ కండువా కప్పుకున్నారు. దీంతో ఖమ్మం నుంచి జలగం వెంకట్రావు అభ్యర్థిత్వం దాదాపు ఖరారైంది. కానీ చివరి నిమిషంలో ఖమ్మం టికెట్‌ను బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. అయితే ఖమ్మం బీజేపీ టికెట్ తనదేనని జలగం వెంకట్రావు చెబుతున్నారు. ఖమ్మం టికెట్‌పై పార్టీ సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఖమ్మం, వరంగల్ బీజేపీ అభ్యర్థులపై బిజెపి స్పష్ట ఇవ్వాల్సి ఉంది. వరంగల్, ఖమ్మం స్థానాలను బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. వరంగల్ బీజేపీ టికెట్ ఆరూరి రమేష్‌కు దాదాపు ఖరారైనట్టు సమాచారం. ఖమ్మం స్థానంపై తర్జన భర్జనలో కమలం పార్టీ ఉంది. మరోవైపు ఖమ్మం సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ నేత నామా నాగేశ్వరరావు బీజేపీలో చేరతారని తాజాగా ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు ఖమ్మం టిక్కెట్ ఆశించి.. బీఆర్ఎస్ నేత జలగం వెంకట్రావు బీజేపీలో చేరారు. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఎంపీ సీటు కోసం పలువురు బీజేపీ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆ పార్టీ జాతీయ నేతలను కలిసి పోటీచేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఖమ్మం పార్లమెంట్ టికెట్ రేసులో పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఖమ్మం లోక్‌సభ సీటు ఆశిస్తున్నవారిలో ఈవీ రమేష్, వాసుదేవరావు, రంగాకిరణ్, గల్లా సత్యనారాయణ ఉన్నారు. మరోవైపు దక్షిణ తెలంగాణపై కమలం పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. నల్లగొండ, ఖమ్మం పార్లమెంట్ స్థానాల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టాలని బీజేపీ నిర్ణయించింది. మరోవైపు నామా బీజేపీలో చేరితే.. బీఆర్ఎస్ తరుపున పువ్వాడ అజయ్‌ను ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపే అవకాశం ఉంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న మూడు కుటుంబాలు కూడా ఖమ్మం జిల్లాలో బలమైన రాజకీయ నేపథ్యాన్ని కలిగి ఉన్నాయి. మొత్తానికి ఖమ్మం జిల్లాలో ఈసారి లోక్‌సభ ఎన్నిక మాత్రం రాష్ట్రంలోనే హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్, బిజెపిల అభ్యర్థులు ఎవరన్నది ఇప్పుడు చర్చగా మారింది.